క్లుప్తంగా

గోమాతను రక్షించిన శానిటరీ సిబ్బంది



కాలువలో పడిపోయిన గో మాతను బయటకు తీస్తున్న శానిటేషన్ సిబ్బంది

కొమ్మాది: మధురవాడ మార్కెట్ సమీపంలోని పెద్ద కాలువలో శనివారం ఉదయం గోమాత పడిపోయింది. ఇటుగా వచ్చిన వినియోగదారులు చూసి జీవీఎంసీ శానిటరీ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంతోష్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని తాళ్లు కట్టి, గంటన్నర శ్రమించి ఆ గోమాతను బయటకు తీసుకువచ్చారు. శానిటరీ సిబ్బందిని స్థానికులు ప్రశంసించారు.

10న అష్టలక్ష్మి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం

కొమ్మాది: స్థానిక అన్నంరాజునగర్‌లోని శ్రీ అష్ట లక్ష్మి దేవాలయంలో ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని ఈ నెల 10వ తేదీన లక్ష్మీ నారాయణుల ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధర స్వామి తెలిపారు. ఆ రోజు ఉదయం 5 గంటల నుంచి దర్శనాలు ప్రారంభమవుతాయన్నారు. ముందుగా వేకువజామున 3.30 గంటలకు మొదటి అర్చన, తోమాల సేవ, 4 గంటలకు తిరుప్పావై సేవాకాలం, పూలంగి సేవ అనంతరం సర్వ దర్శనాలు ప్రారంభం అవుతాయని తెలిపారు. ఉదయం 10 గంటలకు భక్తులచే సామూహిక పారాయణాలు, 12 గంటలకు నైవేద్యం అనంతరం ఆలయం మూసివేస్తామని పేర్కొన్నారు. తిరిగి సాయంత్రం 5 గంటల నుంచి మరలా సర్వదర్శనాలు ఉంటాయని తెలియజేశారు.

సబ్సిడీపై రాగి విత్తనాలు

పద్మనాభం: రబీ సీజన్‌లో రాగి (చోడి) పంట వేయనున్న రైతులకు 80 శాతం సబ్సిడీపై రాగి విత్తనాలను రైతులకు సరఫరా చేయనున్నట్టు మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంపీఎస్ చలం తెలిపారు. మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు కిలోల ప్యాకెట్ అసలు ఖరీదు రూ.290 కాగా సబ్సిడీపై రూ.58కు రైతులకు సరఫరా చేస్తామన్నారు. కావల్సిన రైతులు పద్మనాభం వ్యవశాయ శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. రబీ పంటలకు ఈకేవైసీ చేయాలని తెలిపారు. సమావేశంలో ఏఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ

తగరపువలస: ఆనందపురం మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 17వ విడత సామాజిక తనిఖీలు శనివారం నిర్వహించారు. ఎంపీడీవో జానకి సమక్షంలో ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మండలంలోని 26 పంచాయతీలలో రూ.23 కోట్లతో డిసెంబరు 20 నుంచి జనవరి 4 వరకు నిర్వహించిన తనిఖీలకు సంబంధించి నివేదికలు చదివి వినిపించారు. డ్వామా పీడీ పూర్ణిమాదేవి, జిల్లా విజిలెన్స్ అధికారి నిర్మలాదేవి మాట్లాడుతూ మండలంలో పనులన్నీ సక్రమంగా నిర్వహించారన్నారు. కార్యక్రమంలో ఏపీడీ ఆంజనేయులు, ఏపీవో తిరుమల రావు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ విద్యుత్ మీటర్లతో ప్రజలపై భారం

తగరపువలస: స్మార్ట్ విద్యుత్ మీటర్లు, అధిక రేట్లకు విద్యుత్ ఒప్పందాల కారణంగా ప్రజలపై మోయలేని భారం పడుతుందని సీపీఐ భీమిలి ఏరియా సమితి కార్యదర్శి కానూరి రాంబాబు అన్నారు. గుజ్జు రామునాయుడు భవన్‌లో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల తమిళనాడు ప్రభుత్వం ప్రజలకు నష్టదాయకమైన స్మార్ట్ మీటర్లతో పాటు అదాని కంపెనీతో ఒప్పందాలను రద్దు చేసుకుందన్నారు. మన రాష్ట్ర ప్రభుత్వం కూడా వీటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీల పెంపును సీపీఐ సహించదని, తామంతా పోరాటాలకు కూడా సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు మోర అప్పలరాజు, కె.ఈశ్వరరావు, రాంపైడి, సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.



పందెం కోళ్లు సై



తలపడుతున్న కోడిపుంజులు



తెల్ల సవల

సంక్రాంతి బరిలో కయ్యానికి పందెం కోళ్లు సిద్ధమవుతున్నాయి. మరోవైపు మేలు జాతి కోళ్ల కోసం పందెం రాయుళ్లు వేట ముందే మొదలెట్టేశారు. డేగ కళ్లతో అన్వేషిస్తూ చరణాయుధాలను ఎంపిక చేసుకుంటున్నారు. దీంతో భీమిలి, పద్మనాభం, ఆనందపురం మండలాల్లోని మకాంల వద్ద పండగ సందడి ముందే మొదలైంది.

- సంక్రాంతి బరిలో పోరుకు సిద్ధం
- మకాంలలో పందెంరాయుళ్ల అన్వేషణ
- విదేశీ బ్రీడ్‌లకు యమ క్రేజ్

తగరపువలస: సంక్రాంతి సమీపించడంతో సందడి మొదలైంది. పందెం కోళ్ల మకాంలలో లక్షలాది పందెం కోళ్లు పోరాటంలో శిక్షణ పొంది కాలు దువ్వుతున్నాయి. వీటిలో పై చేయి సాధించే కోళ్ల కోసం తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన పందెం రాయుళ్లు కార్లు వేసుకుని ఉత్తరాంధ్రలోని మకాంలలో డేగ కళ్లతో అప్పుడే వేట మొదలు పెట్టారు. ఆన్‌లైన్‌లో కూడా తమకు సరిపడే జాతి కోడిపుంజులను వెదుక్కుంటున్నారు. ఏడాది పొడవునా మేలుజాతి కోళ్లు ఎక్కడుంటే అక్కడ వాలిపోతున్నారు. మూడు నెలలగా వీటి వ్యాపారం జోరందుకుంది. ఇలాంటి మకాంలు ఎక్కువగా భీమిలి, పద్మనాభం, ఆనందపురం మండలాలు,తిమ్మాపురం, సాగర్‌నగర్, ఆరిలోవ, నర్సీపట్నంతో పాటు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఉన్నాయి.



భీమిలి శివారులోని మకాం

రూ.కోట్లలో వ్యాపారం

పందేలలో తలపడే కోళ్లను పందెంరాయుళ్లు జాగ్రత్తగా ఎంపిక చేసుకుంటారు. సేతువ, కక్కెర, సవల, పాన, రసంగి, డేగ, పచ్చకాకి, అబాస్ రకాలకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. సాధారణంగా ఏడాది వయసున్న కోళ్లు రూ.15–20 వేలు, ఏడాదిన్నరవి రూ.30వేలు, నాలుగేళ్ల వయసు వరకు ఉన్నవి రూ.40వేల వరకు ధర ఉంటుంది. ఒక్క ఉత్తరాంధ్రలోనే రూ.200 కోట్ల వరకు వీటి వ్యాపారం జరుగుతుందంటే ఆశ్చర్యం అనిపించదు.

మకాంలలో చరణాయుధాలు

తెలుగు రాష్ట్రాలలో కుక్కుటం, తామ్రచూడము (తలపై శిఖ వంటి జుత్తు), చరణాయుధాలు (కాళ్లే ఆయుధంగా పోరాటం చేసేది)గా కూడా పిలుస్తారు. ఏడాది పాటు వీటిపై శిక్షణ, ఆహారానికి పెట్టుబడి పెట్టిన వ్యాపారులు, రైతులు ప్రస్తుతం వీటి విక్రయాలపై దృష్టి సారిస్తున్నారు. ఇలాంటి పందెం కోళ్లను సిద్ధం చేసే ప్రాంతాలను మకాం అంటారు.

బరిలో దిగితే గెలుపే..



సేతువ

బెంటాం దేశానికి చెందిన మైలా బ్రీడ్ కోడి పుంజు రూ.20 లక్షల వరకు ఉంటుంది. దీంతో దేశవాళీ కోడిపెట్టలను సంకరం చేయించడం ద్వారా వేలాది పిల్లలను పొదిగించి ఒక్కొక్కటి రూ.5వేలకు పైగా విక్రయిస్తుంటారు. ఈ కోళ్లు బరిలో దిగితే రూ.లక్షల పందెం కొట్టుకువస్తాయని పందెం రాయుళ్ల గట్టి నమ్మకం. అలాగే ఫిలిప్పీన్స్, పెరూ దేశాలకు చెందిన మేలుజాతి కోడి పెట్టలు ఒక్కొక్కటి రూ.6–7 లక్షలు పలుకుతాయి. వీటిని కూడా మేలుజాతి స్వదేశీ, విదేశీ పుంజులతో సంకరం చేయించడం ద్వారా మంచి ఆదాయాన్ని ఇచ్చే పందెం పుంజులను దిగుబడి సాధిస్తున్నారు.

బాదం..ఖీమా

ఒక్కో మకాంలో 50 నుంచి వందలాది కోళ్లు ఉంటాయి. వీటికి ప్రత్యేకంగా రోజుకు నాలుగు బాదం పప్పులు, కోడిగుడ్డు, వారానికోసారి ఖీమా, చోళ్లు, గంట్లు, తడిపిన ధాన్యాన్ని రోజుకు రెండు పూటలా వంద గ్రాముల వంతున ఆహారంగా ఇస్తారు. మధ్యాహ్నం వేళల్లో అలసిపోయే వరకు ఈతకు వదులుతారు. ఏడాది కాలంలో ఒక్కో కోడిపై రూ.10వేలకు పైగా ఖర్చు చేస్తారు. వీటిని చంటిపిల్లల్లా చూసుకుంటారు. తెగుళ్ల వంటివి రాకుండా యాంటీ బయోటిక్ టాబ్లెట్లతో పాటు ఇంజక్షన్లు అందుబాటులో ఉంచుతారు.

అనుమతి ఉంటేనే..

ప్రభుత్వ అనుమతులు ఉంటేనే కోళ్ల వ్యాపారం సక్రమంగా జరుగుతుంది. చాలామంది వారికి నచ్చిన బ్రీడ్‌లను హైదరాబాద్, ఏలూరు, భీమవరం, నర్సీపట్నం, మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాల వారితో కొనడం అమ్మడం చేస్తుంటారు.



–మద్దిల వెంకటరమణ, జిల్లా క్వారీ లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు

రిస్క్ ఎక్కువ

పందెం కోళ్ల పెంపకం రిస్క్‌తో కూడుకున్నది. పెట్టుబడికి రెట్టింపు ఆదాయం వస్తున్నా వాటికి సోకే తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఒక్కోసారి రూ.లక్షలు పోసి కొనుగోలు చేసిన కోళ్లు ఎలాంటి ఆదాయం రాకుండానే మృత్యువాత పడుతుంటాయి. నాటుకోళ్లతో పోలిస్తే పందెం కోళ్లకు తెగుళ్లు తక్కువ. రిస్క్ మాత్రం ఎక్కువ.



– బి.హెచ్.రాజేష్, రేవిడి

జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం ప్రారంభం



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న కార్పొరేటర్లు చిన్నికుమారి లక్ష్మి, కొండబాబు



ఇంటర్ విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎంపీపీ రాంబాబు

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం శనివారం ప్రారంభమైంది. కార్యక్రమాన్ని రెండో వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారి లక్ష్మి, నాలుగో వార్డు కార్పొరేటర్ దొలుపల్లి ఏడుకొండలు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తోందని, దీన్ని విద్యార్థులందరూ సద్వినియోగపరచుకోవాలని కోరారు. మండల విద్యాశాఖ అధికారులు శివరాణి, జయప్రద, కళాశాల ప్రిన్సిపాల్ సి.రాంప్రసాద్ పాల్గొన్నారు.

రెడ్డిపల్లి హైస్కూల్ ప్లస్‌లో..

పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌లో జూనియర్ ఇంటర్ విద్యార్థులకు శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంపీపీ కంటుబోతు రాంబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవో ఎస్‌డీ బాబూలాల్, హెచ్‌ఎం ఎం.సన్యాసిరావు పాల్గొన్నారు.

అదరహో



ఆకట్టుకున్న సిబ్బంది విన్యాసాలు



విజేతలతో 16వ బెటాలియన్ కమాండెంట్ మురళీకృష్ణ



పోలీస్ బెటాలియన్ సిబ్బంది విన్యాసాలు అబ్బురపరిచాయి. జీవీఎంసీ ఆరోవార్డు లోని ఏపీఎస్‌పీ 16వ బెటాలియన్ వార్షిక క్రీడోత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక సిబ్బంది తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించారు. పోటీల్లో విజేతలకు మెడల్స్, ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో 16వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ కేవీ మురళీకృష్ణ, అడిషనల్ కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభ రాజు, డాక్టర్ శిల్ప, అసిస్టెంట్ కమాండెంట్లు పి.సత్యం తదితరులు పాల్గొన్నారు. – పీఎం పాలెం

క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న గరుడ్ సుమిత్ సునీల్

మధురవాడ: విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో, క్రీడలూ అంతే ముఖ్యమని గ్రేహౌండ్ గ్రూప్ కమాండర్ డాక్టర్ గరుడ్ సుమిత్ సునీల్ అన్నారు. అవి వారి ఉజ్వల భవిష్యత్తుకు మేలు చేస్తాయన్నారు. బక్కన్నపాలెంలోని సెయింట్ ఆన్స్ పాఠశాలలో శనివారం నిర్వహించిన క్రీడా వార్షికోత్సవానికి హాజరైన ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థి ఇష్టమైన క్రీడల్లో శిక్షణ పొందితే, తగిన ఫలితాలను సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న డీఈవో ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ ఇష్టంతో, పట్టుదలగా ఆడితే క్రీడల్లో విజయాలు సాధిస్తారన్నారు. పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సుమిత్ సునీల్ బహుమతులు ప్రదానం చేశారు. గుంటూరు సీఎస్‌ఏ ప్రావెన్షియల్ సుపీరియర్ డాక్టర్ రెవరెండ్ సిస్టర్ వి.శౌరీల్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా క్రీడాధికారి జాన్ గేలియట్, పాఠశాల కరస్పాండెంట్ రెవరెండ్ సిస్టర్ జెసీల, ప్రధానోపాధ్యాయిని రెవరెండ్ సిస్టర్ మేగ్ధాలినా పాల్గొన్నారు.

7న ఉమ్మడి జిల్లా స్థాయి రంగోత్సవ్ పోటీలు

భీమునిపట్నం: భీమిలిలోని జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్) వద్ద ఈ నెల 7వ తేదీన ఉమ్మడి జిల్లా స్థాయి రంగోత్సవ్ పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.జ్యోతికుమారి తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఆరు నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఎనిమిది అంశాల్లో పోటీలు ఉంటాయన్నారు. క్విజ్, చిత్ర లేఖనం, తెలుగు, ఇంగ్లిష్ దస్తూరి, రంగోలి ముగ్గులు, డిజిటల్ పోస్టర్ తయారీ, ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ థీమ్‌పై స్లోగన్ రైటింగ్, భారతీయ చరిత్ర, సంస్కృతి విలువలు ప్రతిబింబించే రోల్‌ప్లే మొదలైన అంశాలు ఉంటాయన్నారు.ఒక అంశంలో ఒక విద్యార్థి మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు రిజిస్ట్రేషన్ కోసం వైస్ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్ (9052423757), సీనియర్ అధ్యాపకుడు జి.జి.ఎస్.నాగేశ్వరరావు (9441465299) లను సంప్రదించాలని కోరారు.

ఘనంగా వార్షిక క్రీడా దినోత్సవం



ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన

తగరపువలస: భీమిలి మండలం శింగనబంద ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం 16వ వార్షిక క్రీడా దినోత్సవం ఘనంగా జరిగింది. ప్రీ ప్రైమరీ నుంచి 3వ తరగతి వరకు విద్యార్థులు రన్నింగ్, హర్డిల్స్, డ్రిల్, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ భమిడిపాటి శైల మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇంటర్ వర్సిటీ వాలీబాల్ టోర్నీకి ఎంపిక



పి.రమణి

తగరపువలస: తమిళనాడులో ఈ నెల రెండో వారంలో నిర్వహించనున్న అంతర విశ్వవిద్యాలయాల వాలీబాల్ టోర్నమెంట్‌కు స్థానిక శ్రీబాసర డిగ్రీ కళాశాల విద్యార్థిని పి.రమణి ఎంపికయ్యారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం జట్టు తరపున ఈమె ఆడనున్నారు. ఈ సందర్భంగా ఆమెను విద్యాసంస్థల చైర్మన్ పూడి రమేష్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చప్పా సురేష్ శనివారం అభినందించారు.

టీడీపీ కార్యకర్తకే న్యాయం జరగలేదు

- యామినికి న్యాయం చేసేందుకు సీపీని కలుస్తాం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్



బొట్ట శ్రీనివాసరావు ఇంటి వద్ద వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్

తగరపువలస: కూటమి ప్రభుత్వంలో టీడీపీ కార్యకర్త బొట్ట శ్రీనివాసరావుకే న్యాయం జరగలేదని, ఇక సామాన్య ప్రజలకు ఏం రక్షణ ఉంటుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఇటీవల నెల్లూరులో ఆత్మహత్య చేసుకున్న బొట్ట శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను భీమిలి మండలం టి.నగరపాలెంలో శనివారం ఆయన కలిసి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ టీడీపీ అంటే ప్రాణం పెట్టే శ్రీనివాసరావు ఆత్మహత్య చేసుకున్నప్పుడు 'చంద్రబాబు, లోకేష్, పవన్ తనకు న్యాయం చేయాలి' అని సూసైడ్ నోట్‌లో రాసుకున్నా .. ఇప్పటి వరకు ఎవరూ స్పందించలేదన్నారు. కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. తల్లి యామిని వద్దకు బిడ్డను చేరవేయడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. యామిని ఆత్మహత్యకు ప్రయత్నించి చికిత్స తీసుకున్న నాటి నుంచి.. అత్తింటిపై భర్త దాడి చేసి కుమారుడిని తీసుకుపోయిన వరకు శ్రీనివాసరావు కుటుంబానికి అన్యాయం జరిగిందన్నారు. సాంకేతికంగా అభివృద్ధి చెందినా నిందితుడిని పోలీసులు పట్టుకోలేకపోవడం వారి వైఫల్యమేనన్నారు. పార్టీలకు అతీతంగా యామినికి న్యాయం చేసేందుకు నగర పోలీస్ కమిషనర్‌ను కలుస్తామన్నారు. శ్రీనివాసరావు ఆత్మకు శాంతి కలగాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, దాట్ల పెదబాబు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, గాడు శ్రీను, కేపీ సత్యనారాయణ, పొట్నూరు చంద్రశేఖర్, పల్లా సన్యాసిరావు, పల్లా వెంకటరావు, ఆర్ఎస్ఎన్ మూర్తి, దుంపల ప్రభాకర్, పల్ల అప్పారావు, పూసర్ల ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు

శతాబ్ది ఉత్సవాల కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

భీమునిపట్నం: భీమిలిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాలు ఫిబ్రవరి 1, 2 తేదీల్లో ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గాడు అప్పలనాయుడు, మైలిపల్లి లక్ష్మణరావు తెలిపారు. ఈ ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను పాఠశాల వద్ద శనివారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఒకటో తేదీన ప్రారంభ సభ, పూర్వ విద్యార్థుల సమావేశం, ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రెండో తేదీన సావనీర్ ఆవిష్కరణ, ఉన్నత స్థాయిలో స్థిరపడిన పూర్వ విద్యార్థులకు సత్కారంతో పాటు ఇతర కార్యక్రమాలు జరుగుతాయని తెలియజేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అంధుల జీవితాల్లో వెలుగురేఖ బ్రెయిలీ



బ్రెయిలీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎంఈవో శివరాణి, భవిత కేంద్రం పిల్లలు

భీమునిపట్నం: అంధుల కోసం ప్రత్యేక లిపిని కనుకొన్న లూయిస్ బ్రెయిలీ వారి జీవితాల్లో వెలుగులు నింపారని మండల విద్యాశాఖ అధికారి శివరాణి అన్నారు. బ్రెయిలీ జయంతి సందర్భంగా భీమిలిలోని భవిత కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. భవిత కేంద్రం టీచర్ కెజియా కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రెయిలీకి నివాళులు

తగరపువలస: అంధుల లిపి సృష్టికర్త బ్రెయిలీ జయంతిని బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో శనివారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులకు శిక్షణ

తగరపువలస: తాటితూరు జెడ్పీహైస్కూల్‌లో శనివారం పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కమిటీ హక్కులు, బాధ్యతల గురించి ప్రధానోపాధ్యాయుడు డొకర శ్రీనివాసరావు వివరించారు. రిసోర్స్ పర్సన్‌గా ఉపాధ్యాయుడు టి.ఎస్.వి. ప్రసాదరావు వ్యవహరించారు.కార్యక్రమంలో కమిటీ చైర్మన్ బుడుమూరి సోమేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలలో చిన్నారుల సమగ్ర వికాసం

తగరపువలస: మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ భీమిలి పీవో శ్రీదేవి కోరారు. ఆనందపురం మండలం బొడ్డపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం నిర్వహించిన ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్ కార్యక్రమంలో భాగంగా తల్లులకు అవగాహన కల్పించారు. చిన్నారులకు ఆటలు, పాటలు నేర్పించారు. ప్రీ స్కూల్ వలన చిన్నారులలో సమగ్ర వికాసం సాధ్యమవుతుందన్నారు. సూపర్‌వైజర్ పీవీవీ రత్నం, కార్యకర్త రమణమ్మ పాల్గొన్నారు.

దళితులకు చంద్రబాబు చేసింది శూన్యం



కరపత్రాలు విడుదల చేస్తున్న గోపాలరావు

తగరపువలస: మాలలను వర్గీకరణ పేరుతో విడగొట్టిన చంద్రబాబు వారికి ఎలాంటి మేలు చేయలేదని మాల మహానాడు వ్యవస్థాపకుడు భాగం గోపాలరావు అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో శనివారం ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు సంబంధించి సుప్రీంకోర్టు సూచనల మేరకు దళితులకు సంక్షేమ పథకాలను చంద్రబాబు వాయిదా వేశారన్నారు. 15 శాతం ఉన్న దళితులకు అన్యాయం జరిగినా ఉద్యోగ సంఘాలు స్పందించడం లేదన్నారు. తమకు జరుగుతున్న అన్యాయం బాహ్యప్రపంచానికి తెలిసేలా మాలలు పోరాటానికి సిద్ధం కావాలన్నారు. దీనికి సంబంధించి కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు బోని సన్నిబాబు, ఉత్తరాంధ్ర కన్వీనర్ మామిడి శివ, జిల్లా అధ్యక్షుడు కొట్యాడ ఈశ్వర్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సియ్యాద్రి రాంబాబు, భీమిలి టౌన్ అధ్యక్షుడు ఉప్పాడ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

